సాక్షి పెద్దపల్లి
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పాలకుర్తి: బోడగుట్టపల్లి, నక్కిరెడ్డిపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు.



మండే సూరీడు

- జిల్లాలో 43.4 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు

జ్యోతినగర్(రామగుండం): జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సోమవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతర్గాం మండలం ఆకెనపల్లిలో గరిష్ఠంగా 43.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠంగా 36.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. వేడిమికి తట్టుకోలేక ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు.

వారం రోజుల ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
15	40.0	24.4
16	39.0	23.0
17	38.4	22.8
18	38.6	26.4
19	38.8	27.7
20	40.2	28.2
21	43.4	36.7

న్యూస్‌రీల్

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వేణు

జూలపల్లి(పెద్దపల్లి): భూ భారతి ఆర్‌వోఆర్ చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. భూ వివాదాలు, ఇతర సమస్యల సత్వర పరిష్కారానికి ఈ చట్టం మార్గం చూపుతుందని వివరించారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో పద్మ, ఏవో ప్రత్యూష, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ప్యాక్స్ చైర్మన్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన అభివృద్ధికి చర్యలు



నేల నాణ్యత పరీక్షిస్తున్న సిబ్బంది

రామగుండం: స్థానిక రైల్వే ఫ్లై ఓవర్‌ను టీ–జంక్షన్‌గా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆర్ అండ్ బీ సిబ్బంది సోమవారం పలుచోట్ల మట్టి శాంపిళ్లు సేకరించారు. ఫ్లై ఓవర్ ప్రస్తుతం గోదావరిఖని నుంచి రామగుండం రైల్వేస్టేషన్ మధ్య రాకపోకలు సాగించే వారికే సౌకర్యంగా ఉంది. దీంతో దీనిని విస్తరిస్తూ అంతర్గాం బైపాస్ నుంచి వచ్చిపోయే వాహనదారులకు కూడా సౌకర్యంగా ఉండేందుకు వీలుగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈక్రమంలోనే గురుకుల విద్యాలయం సమీపం వరకు టీ జంక్షన్‌గా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. ఫలితంగా అంతర్గాం నుంచి రాకపోకలు సాగించే వాహనాలు నేరుగా వంతెనపై నుంచి రైల్వేస్టేషన్, గోదావరిఖని వెళ్లే అవకాశం ఉంటుంది.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



రేవెల్లి శిరీష

ధర్మారం(ధర్మపురి): దొంగతుర్తి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని రేవెల్లి శిరీష జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలిక అత్యంత ప్రతిభ కనబర్చిందని పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో శిరీష తెలంగాణ జట్టు తరఫున పాల్గొంటుందని ఆయన వివరించారు. శిరీషను ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

23న ఉద్యోగ మేళా

కమాన్‌పూర్(మంథని): గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 23న ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సుధాకర్ తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బీపీసీ చదివి 20ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనంతోపాటు ఉచిత భోజన, వసతి కల్పిస్తారన్నారు. అంతేకాదు.. ఉద్యోగం చేస్తూనే డిగ్రీ చదువుకునే అవకాశాన్ని కంపెనీ కల్పిస్తుందని ఆయన వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు బుధవారం ఉదయం 9.30 గంటలకు కళాశాలలో హాజరు కావాలని ఆయన కోరారు.

క్రీడలకు ఎన్టీపీసీ పెద్దపీట

జనరల్ మేనేజర్ అలోక్ కుమార్ త్రిపాఠి



పరిచయం చేసుకుంటున్న జీఎం త్రిపాఠి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ క్రీడలకు పెద్దపీట వేస్తోందని ప్రాజెక్టు జనరల్ మేనేజర్ అలోక్‌కుమార్ త్రిపాఠి అన్నారు. సోమవారం రాత్రి ఎన్టీపీసీ మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఫుట్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ ఉద్యోగులు విధులతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని ఆయన అన్నారు. ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో జీఎంలు ముకుల్ రాయ్, కేసీ సింగరాయ్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ గనేశ్వర్ జడ్జితోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

భరోసా ఏది?



- అందని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లోనే అమలు
- మిగతా పల్లెల్లో తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 15,046 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు
- నిరాశలో ఉపాధిహామీ రైతు కూలీలు

సాక్షి, పెద్దపల్లి: ఆత్మీయ భరోసా పథకం జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకావడంలేదు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉండి 20 రోజులు పనిచేసిన భూమిలేని రైతు కూలీలకు ఏడాదిలో రెండు విడతలుగా రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఆత్మీయ భరోసా పేరిట ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. గత జనవరి 26న ఇందిరమ్మ ఇళ్ల పథకం, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకాలను ఆరంభించిన రోజే మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆయా పథకాలకు ఎంపిక చేసిన అర్హులైన లబ్ధిదారులకు వర్తింపజేశారు. మిగిలిన గ్రామాల్లోని రైతు కూలీలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద గుర్తించినా.. వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమచేయలేదు. దీంతో ఉపాధిహామీ కూలీలు ఆ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లోనే..

2023–24 ఆర్థిక సంవత్సరంలో 20రోజల పాటు ఉపాధిహామీ పథకం ద్వారా కూలి పనులు చేసిన భూమిలేని వారు జిల్లావ్యాప్తంగా 15,046 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో అత్యధికంగా పెద్దపల్లి మండలంలో 2,156 మంది రైతు కూలీలు ఉన్నారని అధికారులు తేల్చారు.

జాబితాలో లేనివారి కోసం..

అర్హుల జాబితాలో పేర్లు రానివారి నుంచి గత జనవరి 24, 25వ తేదీల్లో నిర్వహించిన గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఇలా జిల్లావ్యాప్తంగా మరో 6,584 మంది రైతు కూలీలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 13 గ్రామాల్లో గుర్తించిన రైతు కూలీలు మినహా మిగతా గ్రామాల్లోని రైతు కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదు.

ఎమ్మెల్సీ కోడ్ ముగిసినా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో రైతుకూలీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసేందుకు బ్రేక్ పడింది. అయితే, కోడ్ ముగిసి నెలలు గడుస్తున్నా తమ బ్యాంకు ఖాతాల్లో ఇంకా డబ్బులు జమచేయలేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు లబ్ధిదారులు కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా అర్హులైన ప్రతీఒక్కరి బ్యాంకు ఖాతాల్లో తొలివిడత కింద రూ.6వేలు జమచేయాలని వేడుకుంటున్నారు.

అర్హులైన ఈజీఎస్ కూలీలు

మండలం	గుర్తించిన కూలీలు
పెద్దపల్లి	2,156
సుల్తానాబాద్	1,907
మంథని	1,960
ఎలిగేడు	472
ఓదెల	1,010
రామగిరి	1,049
కమాన్‌పూర్	568
పాలకుర్తి	1,216
జూలపల్లి	440
ముత్తారం	575
ధర్మారం	1,341
అంతర్గాం	1,133
కాల్వశ్రీరాంపూర్	1,219

జాబితాలో పేరు వచ్చింది కానీ..



ప్రభుత్వం భూమి లేనిపేద రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తున్నది. ఈ లిస్టులో నా పేరు వచ్చింది. కానీ, నేటివరకు ఒక్క రూపాయి కూడా నా అకౌంట్‌లో జమకాలేదు. ఇప్పటికీ కరువు పనిపోతున్న. ప్రభుత్వం ఆ పైసలు జమ చేస్తే అవసరాలకు అక్కరకు వస్తయి.

– దొమ్మటి స్వామి, కూలీ, ఓదెల

డబ్బులు పడలేదు



కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రెండు విడతల్లో రూ.12వేలు ఇస్తామని చెప్పింది. జాబితాలో నా పేరు వచ్చింది. కానీ, నేటికీ నా బ్యాంకు ఖాతాలో డబ్బులు పడలేదు. ప్రభుత్వం తక్షణం డబ్బు జమచేయాలె.

– చెప్యాల మల్లేశ్వరి, కూలీ, కమాన్‌పూర్


ప్రభుత్వానికి నివేదించాం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం బకాయిలపై నివేదిక తయారు చేశాం. అర్హులైన లబ్ధిదారుల పేర్లతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.

– కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

జలవెల!

ప్రాజెక్టు రిపోర్ట్



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో అడుగంటిన నీరు

- అడుగంటుతున్న జలాశయాలు
- ఎల్ఎండీ డెడ్‌స్టోరేజీకి రాలేదంటున్న అధికారులు
- ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎనిమిది టీఎంసీలు
- మిడ్ మానేరులోనూ అదే తీరు
- సాగునీటికి ఇబ్బందులు లేవంటున్న ఇరిగేషన్‌శాఖ

సాక్షిప్రతినిధి,కరీంనగర్: రోజురోజుకు పెరుగుతున్న ఎండల కారణంగా ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు క్రమంగా అడుగంటుతున్నాయి. వరదకాలువ, కాళేశ్వరం నుంచి కొంతకాలంగా ఎత్తిపోతలు లేకపోవడంతో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే పంట కోతలు పూర్తయిన నేపథ్యంలో వ్యవసాయపరంగా ఇబ్బందులు లేవని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు జూన్ వరకు సరిపోతుందని, తాగునీటికి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. దంచికొడుతున్న ఎండల నేపథ్యంలో రోజుకు పదుల సంఖ్యలో క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. తాగునీటికి ఇబ్బంది వచ్చే పరిస్థితే ఉత్పన్నమవదని, ఆలోపు వర్షాలు వచ్చేస్తాయని ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

లోయర్ మానేరులో ఏడు టీఎంసీలు

లోయర్ మానేరు డ్యాంలో ప్రస్తుతం ఏడు టీఎంసీల నీరు నిల్వఉంది. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథకు డెడ్‌స్టోరేజీ 3.8 టీఎంసీలు, కాగా సాధారణ డెడ్‌స్టోరేజీ 2 టీఎంసీలుగా పరిగణిస్తామని తెలిపారు. తాగునీటి అవసరం కోసం ప్రాజెక్టు నుంచి ఇప్పటి నుంచి జూలై నెలవరకు వరకు రోజుకు సుమారు 300 క్యూసెక్కుల నీటిని వాడుకున్నా.. 1.5 టీఎంసీలు అవసరం అవుతుంది. ఇతర అవసరాలకు టీఎంసీ కావాలి. 3.8 టీఎంసీల కన్నా దిగువకు వస్తే ఎలగందుల, పరిసర ప్రాంతాలకు మాత్రం ఇబ్బందిగా మారుతుంది. ఆలోపు వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.

మిడ్‌మానేరులో 7.074 టీఎంసీలు

మిడ్‌మానేరు జలాశయం నుంచి పంటలకు, తాగునీటి అవసరాలకు ఇప్పటి వరకు కరీంనగర్ ఎల్ఎండీ ప్రాజెక్ట్‌లోకి 20 టీఎంసీల మేర నీరు తరలింది. ఎండలకు రోజుకు 140 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. జూలై వరకు ఒకటిన్నర టీఎంసీ నీరు ఆవిరి కానుంది. మిడ్ మనేరు ప్రాజెక్ట్ నుంచి సిరిసిల్ల జిల్లాకు రోజుకు మిషన్ భగీరథ కింద 40క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. జూలై 31వరకు మిడ్ మానేరులో తాగునీటి అవసరాలకు నాలుగు టీఎంసీల నీరు నిల్వ ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేదని మిడ్ మానేరు ప్రాజెక్ట్ ఈఈ జగన్ తెలిపారు. 2024 ఏప్రిల్ 21న ప్రాజెక్ట్‌లో 5.96 టీఎంసీల నీరు ఉంటే ఇప్పుడు 7.074 టీఎంసీల మేర నీరు ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉందన్నారు.

ఎల్లంపల్లిలో 8.76 టీఎంసీలు

20.175 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 8.76 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఇదే రోజు 6.75టీఎంసీల నీరు ఉండేది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 2టీఎంసీల నీరు ఎక్కువగా ఉండటంతో తాగునీటి అవసరాలకు ఢోకాలేదని సబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ మె ట్రోవర్క్ స్కీం (హెచ్ఎండబ్ల్యూఎస్) కోసం 330 క్యూసెక్కులు, రామగుండంలోని ఎన్టీపీసీ పంప్ హౌజ్‌కు 121 క్యూసెక్కులు, పెద్దపల్లి, రామగుండం మిషన్ భగీరథ పథకం కోసం 58 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మంచిర్యాల జిల్లా ప్ర జల తాగునీటి అవసరాల కోసం 23 క్యూసెక్కుల ను విడుదల చేస్తున్నారు. ఎండల కారణంగా 190 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. ప్రతిరోజు ప్రాజెక్టు నుంచి 723 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రస్తు తం ప్రాజెక్ట్‌లోని నీరు జూన్ వరకు తాగునీటి అవసరాలు తీరుస్తుందని అధికారులు వెల్లడించారు.



కరీంనగర్ ఎల్ఎండీలో పడిపోయిన నీటిమట్టం



మిడ్‌మానేరులోని నీటిమట్టం పరిస్థితి ఇలా..

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సింగరేణి యాజమాన్యం ముందుకు సాగుతోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. జనగామ గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ పనులను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ పథకాలతోనే రైతులకు గౌరవం పెరుగుతుందని అన్నారు. రూ.25కోట్లతో సింగరేణి నిర్మించిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ద్వారా త్వరలో కార్మిక వాడలకు మిషన్‌భగీరథ తరహాలో స్వచ్ఛమైన నీరు అందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కిరణ్‌బాబు, వెంకటేశ్వర్‌రావు, కర్ణ, వరప్రసాద్, వసంత్‌కుమార్, కాంగ్రెస్ నేతలు స్వామి, ముస్తఫా పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

సన్నాల మిల్లింగ్‌కు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- 10 బాయిల్డ్ రైస్‌మిల్లులను గుర్తించాలి
- లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ముందుకు..
- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు

పెద్దపల్లిరూరల్: యాసంగిలో సాగుచేసిన సన్నరకం వడ్లు లక్ష మెట్రిక్ టన్నులు సేకరించి మిల్లింగ్ చేసేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. సన్నరకం ధాన్యం మిల్లింగ్ చేసేందుకు 10 బాయిల్డ్ రైస్‌మిల్లులను గుర్తించాలన్నారు. డీఆర్డీవో, సివిల్ సప్లయ్ అధికారులు సమన్వయంతో ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. రా రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సన్నరకం ధాన్యంపై మార్గదర్శకాలు వెల్లడించాలన్నారు. నిబంధనలు పాటించే మిల్లర్లకే ధాన్యం కేటాయించాలని అన్నారు. మిల్లర్లు ముందుకు రాకుంటే ఇంటర్మీడియట్ గోదాములకు తరలించాలని సూచించారు. డీపీవో ఆదిరెడ్డి, డీసీవో రాజేందర్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

లాభదాయక యూనిట్లకు ప్రాధాన్యం

రాజీవ్ యువ వికాసం కింద లాభదాయక యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. ఒక గ్రామంలో ఒకేరకమైన యూనిట్లు స్థాపించకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈనెలాఖరులోగా మండలాల వారీగా విచారణ పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఆ జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ఖరారు చేస్తామని తెలిపారు. దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను తహసీల్దార్ పరిశీలించాలని ఆదేశించారు. డీఆర్డీవో కాళిందిని, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ వినోద్‌కుమార్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

ఎలిగేడు(పెద్దపల్లి): భూ సంబంధిత సమస్యల పరిష్కారానికే భూ భారతి ఆర్‌వోఆర్– 2025 చట్టం అమలు చేస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. భూముల క్రయ, విక్రయాలు, మ్యాప్, హద్దుల తయారీ, స్లాట్ బుకింగ్, పాస్‌పుస్తకాలు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధిహామీ తదితర పనులు పరిశీలించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సుల్తాన్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యారెడ్డిని శాలువాతో సత్కరించారు. ధాన్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వేణు, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, డీఎం శ్రీకాంత్, తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, ఐకేపీ ఏపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, ఆర్‌ఐలు శేఖర్, జయలక్ష్మి సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పది వేల మంది

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాసరి, నాయకులు

పెద్దపల్లిరూరల్: ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలించేలా కార్యాచరణ సిద్ధం చేశామని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సభ ప్రచార పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు అయిన సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలన్నారు. సభ పూర్తయ్యాక బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పథకాలు, ప్రస్తుతం అందుతున్న పథకాలు, పాలనతీరుపై ఊరూరా రచ్చబండ చర్చలు జరపాలని సూచించారు. ఎండల తీవ్రతతో వాహనాల్లో ప్రయాణించే వారికి మంచినీళ్లు, మజ్జిగ పాకెట్లు, భోజనం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు మర్కు లక్ష్మణ్, ఉప్పు రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, బాలాజీరావు, శ్రీనివాస్, మోహన్‌రావు, మోబిన్, దేవయ్య, చంద్రశేఖర్, సతీశ్, శ్రీధర్, ప్రేమ్, శ్రీకాంత్, నటరాజ్, అతీఖ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ భరోసా

- టన్ను బొగ్గుపై రూ.20 చెల్లించేందుకు ఆదేశాలు
- రామగుండం ప్రాంతంలో 65 వేల మంది పింఛన్‌దారులు



గోదావరిఖని: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) బోర్డు, కోలిండియా యాజమాన్యం గత జనవరిలో హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సమావేశమయ్యాయి. సీఎంపీఎఫ్ ట్రస్ట్‌లో లోటు బడ్జెట్‌ను అధిగమించేందుకు పింఛన్ నిధి పెంచుకోవాలని నిర్ణయించాయి. దీంతో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కమిషనర్ విక్రమ్‌దేవదత్ ఆదేశాలతో కోలిండియా యాజమాన్యం స్పందించింది. అప్పటివరకు టన్ను బొగ్గుపై రూ.10 ఉన్న పింఛన్ ఫండ్‌ను రూ.20కు పెంచింది. అంతేకాకుండా.. రెండునెలలుగా కోలిండియా దీనిని అమలు చేస్తోంది. గత శుక్రవారం ఢిల్లీలో జరిగిన సీఎంపీఎఫ్ సమావేశంలో సింగరేణి సీఎండీ బలరాం.. కోలిండియా సూచనల మేరకు స్పందించారు. టన్ను బొగ్గుపై రూ.20 చెల్లించేందుకు అంగీకరించారు. ఈమేరకు సింగరేణిలో ఆదేశాలు జారీ అయ్యాయి. వచ్చేనెల నుంచి నిధులు జమ చేసేందుకు సీఎండీ నిర్ణయం తీసుకున్నారు.

సీఎంపీఎఫ్‌లో రూ.22,452 కోట్ల మూలనిధి

సీఎంపీఎఫ్‌లో ప్రస్తుతం రూ.22,452 కోట్ల మూలనిధి ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కోలిండియాలో 5.4లక్షల మంది, సింగరేణిలో 84వేల మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. మరో ఆరేళ్లలో వారిసంఖ్య మరింత పెరుగుతుంది. అప్పటివరకు పింఛన్ ఫండ్‌లో లోటు ఏర్పడుతుందని ట్రస్ట్ ప్రతినిధులు భావిస్తున్నారు. అందుకే.. కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది.

రూ.10వేల పింఛన్ ఇవ్వాలి



సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల్లో భరోసా కల్పించేందుకు రెండుసార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించా. గతంలో రూ.10 సింగరేణి చెల్లించేది. నా పోరాటంతో మరో రూ.10 కలిపి ప్రస్తుతం రూ.20 చెల్లించేలా అంగీకారం కుదిరింది. ప్రతీరిటైర్డ్ ఉద్యోగికి నెలకు కనీసం రూ.10వేల పింఛన్ వచ్చేలా పోరాటం చేస్తా.

– వంశీకృష్ణ, ఎంపీ, పెద్దపల్లి

భరోసా కల్పించాం



కోలిండియా యాజమాన్యం ఆదేశాల మేరకు టన్ను బొగ్గుపై రూ.20 చెల్లించేందుకు అంగీకరించాం. సింగరేణిలో అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేశాం. వచ్చేనెల నుంచి సీఎంపీఎంఫ ఖాతాలో ఈ సొమ్ము జమవతుంది. సుమారు 80 వేల మంది పైచిలుకు రిటైర్డ్ ఉద్యోగులకు దీనిద్వారా భరోసా లభిస్తుంది.

– బలరాం, సీఎండీ, సింగరేణి

క్లుప్తంగా

చెరువులో మునిగి ఒకరి మృతి

- చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతు


రషీద్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): చేపలు పట్టేందుకు వెళ్లి.. వ్యక్తి చెరువులో గల్లంతవగా.. మరొకరు సురక్షితంగా బయటపడ్డ సంఘటన ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. కొండాపూర్‌కు చెందిన మహ్మద్ రషీద్(45), బాబా(30) గ్రామ శివారులోని పెద్ద చెరువులోకి చేపలు పట్టేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. ఇద్దరు వలతో చెరువులోకి దిగారు. రషీద్ చెరువులో మునిగిపోయాడు. రషీద్ కోసం బాబా ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గ్రామంలోకి వెళ్లి విషయం తెలిపాడు. గ్రామస్తులు పెద్దచెరువులో రాత్రి ఎంత గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం సిరిసిల్ల నుంచి గజఈతగాళ్లను రప్పించారు. వారు రషీద్ మృతదేహాన్ని బయటకు తీసుకురావడంతో భార్య షెహనాజ్, కూతురు రేష్మ, కుమారుడు రఫీ, బంధువుల రోదనలు మిన్నంటాయి. రషీద్ ఆరు నెలల క్రితమే దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మూడేళ్ల క్రితం అదే చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మహ్మద్ ఎక్రామ్ చనిపోయాడు.

విద్యుత్ షాక్‌తో రైతు..


మృతి చెందిన రైతు మల్లేశం

బుగ్గారం: పంటకు నీరు పెట్టడానికి వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుగ్గారం మండలం గోపులాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోవిందుల మల్లేశం(58) సోమవారం ఉదయం పెసరు, నువ్వుల పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ డబ్బా ఇనుపది కావడంతో సర్వీస్ వైరు మధ్యలో కొద్దిగా కట్ అయిన విషయం తెలియక మోటార్ స్టార్ట్ చేసేందుకు యత్నించాడు. డబ్బాకు అంటిన సర్వీస్ వైరుకు విద్యుత్ సరఫరా అయి రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మల్లేశం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో.. బైక్ ఢీకొని ఒకరు..

వీణవంక: ఐలబాద్ గ్రామ శివారులో ఆటో, బైక్ ఢీకొని ఆటో డ్రైవర్ కర్నాల నాగరాజు(46) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని కోతిరాంపూర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు జమ్మికుంట నుంచి కరీంనగర్‌కు వెళ్తున్నాడు. ఐలబాద్ శివారులో కరీంనగర్ నుంచి వీణవంకకు బైక్‌పై వస్తున్న మర్రి రమేశ్ అతివేగంతో ఆటోను ఢీ కొట్టాడు. దీంతో నాగరాజు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రమేశ్, బైక్ వెనక కూర్చున్న మల్లేశం తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య దేవలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

సాగునీరు విడుదల చేయాలి

జూలపల్లి: సాగునీరు లేక వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయే అవకాశం ఉందని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జూలపల్లిలో మాట్లాడారు. శ్రీరాంసాగర్ డీ- 83,86 కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని, లేకుంటే ఎల్లంపల్లి నీటిని రాగంపేట వద్ద కెనాల్‌కు అనుసంధానం చేసి నీరివ్వాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే నాయకులు రైతు భరోసా, రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదని విమర్శించారు.







ఆకట్టుకునే గోడ రాతలు

గతంలో వాల్‌రైటింగ్స్‌కు ఎంతో క్రేజ్ ఉండేది. ఎన్నికలు, ఇతరత్రా వేడుకల సందర్భంగా పల్లెల నుంచి పట్టణాల వరకూ గోడలన్నీ నాయకులు, పార్టీల గుర్తులు, అతిథులు, ప్రతినిధుల పేర్లు, చిత్రాలతో నిండిపోయేవి. ప్రత్యర్థులు పోటాపోగా ప్రచారం చేసేందుకు ఈ పద్ధతి ఎంచుకునేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఆ స్థానాన్ని భర్తీ చేయగా.. ఇప్పుడు గోడలపై రాతలు మళ్లీ ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రాజీవ్ రహదారి వెంట అక్కడక్కడా గోడలపై 'చలో బీఆర్ఎస్ సభ' అంటూ వాల్ రైటింగ్‌లు రాస్తున్నారు. ఇవి స్థానికులకు పాత రోజులు గుర్తు చేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



విద్యార్థులే 'సాగు'లో శాస్త్రవేత్తలు

- రావెప్‌కు కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలు ఎంపిక
- రైతులతోనే నాలుగు నెలల పాటు క్షేత్రస్థాయి పాఠాలు
- భౌగోళిక స్వరూపం, ప్రదర్శనల రూపకల్పన


సెక్రటరీ హమీద్‌తో మార్కెట్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ అర్బన్: అవును.. విద్యార్థులే శాస్త్రవేత్తలుగా సలహాలు, సూచనలు అందించనున్నారు. అంతర్జాలం ద్వారా అందే సేవలను వివరించడంతో పాటు రైతుల జీవన ప్రమాణాలను రూపొందించనుండగా గ్రామ భౌగోళిక స్వరూపాన్ని డయాగ్రామ్ ద్వారా నివేదించనున్నారు.

గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా వ్యవసాయ విద్యార్థినులు నాలుగు నెలలపాటు గ్రామాల్లోనే బస చేయనున్నారు. కరీంనగర్ ఏరువాక ఆధ్వర్యంలో కార్యాచరణను రూపొందించగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎంపిక చేయగా ఇప్పటికే విద్యార్థులు రైతులతో మమేకమయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ కళాశాలకు చెందిన మొత్తం 21మంది విద్యార్థులకు గానూ 4–5గురు విద్యార్థులతో బృందాలను ఏర్పాటు చేసి, మండలానికో గ్రామం ఎంపిక చేశారు. కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి మండలం నాగుల మల్యాల, జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలం తడగొండ గ్రామాల్లో క్షేత్రస్థాయి అనుభవాలను గడిస్తున్నారు. జూన్ వరకు కార్యక్రమాల నిర్వహణతో పాటు అనుభవాలను పొందనున్నారని కరీంనగర్ ఏరువాక సమన్వయకర్త డా.మదన్‌మోహన్‌రెడ్డి వివరించారు.

యూట్యూబ్, టోల్‌ఫ్రీ సేవలపై ప్రచారం

రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుసరించేలా అంతర్జాల వివరాలపై అవగాహన కల్పించనున్నారు. రైతు వేదికలో ఎప్పటికప్పటి సమాచారాన్ని ప్రదర్శించనున్నారు. గ్రామీణ విశ్లేషణాత్మక తులనం(పీఆర్‌ఏ)లో భాగంగా సోషల్ మ్యాప్ వేసి గ్రామంలో ఉన్న భౌగోళిక వివరాలు, పోస్టాఫీస్, బ్యాంకులు, ఇతరత్రా వివరాలను రూపొందించనున్నారు. యూట్యూబ్ ఛానల్ 'పీజేటీఎస్ఏయూ'లో అగ్రికల్చర్ యూనివర్సిటీ వీడియోలు ఉండనుండగా అథెంటిక్‌గా రూపొందించారు. ప్రధాన శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు చూసుకోవచ్చు. రైతుల విజయగాథలు ఉండనుండగా నిర్దిష్టమైన సమాచారం ఉంటుంది. వరి, పత్తి, మొక్కజొన్న, పెసలు, మినుములు, అపరాలు, తృణధాన్యాలపై వీడియోలు ఉండనున్నాయి. కిసాన్ సారథి టోల్‌ఫ్రీ నంబర్ 14426 లేదా 18001232175 ఫోన్ చేసి రైతులు తమ సమస్యలను వివరిస్తే పరిష్కారం చూపనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సేవలందనుండగా రైతులు ఫోన్ చేస్తే ఏ జిల్లా నుంచి చేస్తున్నారో ఆ జిల్లా ఏరువాక, కేవీకే శాస్త్రవేత్తలు లైన్‌లోకి రానున్నారు. ఇక వ్యవసాయ యూనివర్సిటీలు రూపొందించిన విత్తనాలను రైతుల క్షేత్రాల్లో ప్రాక్టికల్‌గా పరీక్షించనున్నారు.

విత్తు నుంచి కోత వరకు సేవలు

ఒక్కో విద్యార్థినికి ఒక్కో రైతును అటాచ్ చేయగా వివిధ రకాల విత్తనాలు వేసిన నుంచి పంట కోత వరకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. విత్తన ఎంపిక, విత్తన శుద్ధితో పాటు పంటలకు ఆశించే చీడపీడల నివారణ, దిగుబడులు ఎక్కువగా వచ్చేందుకు అనుసరించిన యజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తల సూచనల క్రమంలో ఫీల్డ్‌లో అమలు చేయనున్నారు. ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగం పొదుపుగా జరిగేలా సూచనలు చేయనున్నారు. అలాగే ఏ గ్రామంలో సేవలందిస్తున్నారో ఆ గ్రామ నైసర్గిక స్వరూపంతో పాటు వనరులను వివరిస్తూ డయాగ్రామ్ రూపొందించనున్నారు.

నాలుగు నెలల పాటు సేవలు



మాది సిద్దిపేట. సిరిసిల్ల వ్యవసాయ కళాశాలలో అగ్రి కల్చర్ లాస్ట్ ఇయర్ చదువుతున్న. వ్యవసాయ విద్యార్థులకు తరగతి బోధనలతో పాటు ప్రాక్టికల్ అవగాహన అవసరం. అందుకే నాలుగు నెలల పాటు పంట పొలాలు, రైతుల మధ్య తిరుగుతూ నివేదికలు, మ్యాప్‌లు రూపొందించాల్సి ఉంటుంది.

– పి.స్పందన, అగ్రికల్చర్ విద్యార్థి, సిద్దిపేట

మంచి అవకాశం



మాది కొత్తగూడెం జిల్లాలోని అస్వాపూర్ ప్రాంతం. రైతులతో కలిసి వారి కష్టాలను తెలుసుకోవడం మంచి అవకాశం. అగ్రికల్చర్ విద్య చదవాలని ఆశతో ప్రవేశపరీక్ష రాస్తే సిరిసిల్లలో సీటొచ్చింది. మా నాన్న రమేశ్ ఐటీసీలో ఉద్యోగి. అమ్మ స్వరూపరాణి. వారి ప్రోత్సాహంతో వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న.

– బి.జ్యోత్స్న, విద్యార్థి, అస్వాపూర్(కొత్తగూడెం)

ఆధునికత వైపు నడిపిస్తా



నా తల్లిదండ్రులది పూర్తిగా వ్యవసాయ నేపథ్యం. చిన్నతనం నుంచే వ్యవసాయమంటే మక్కువ ఎక్కువ. అందుకే వ్యవసాయ విద్యనభ్యసిస్తున్నా. రైతులను సాంకేతిక సాగు వైపు ప్రోత్సహించాలనేది నా అభిలాష.

– పి.స్పందన, విద్యార్థి, గోవిందపూర్, జమ్మికుంట

ఆఫీసులంటే ఏమిటో తెలుస్తోంది



అమ్మ,నాన్న ఇద్దరూ ఉద్యోగులే. నాన్న సురేందర్ ఏపీవో కాగా అమ్మ విజయలక్ష్మి టీచర్. పుట్టి పెరిగింది గ్రామీణ నేపథ్యం కావడంతో వివిధ రకాల పంటలను చూసినప్పుడు అగ్రికల్చర్ చదవాలనిపించింది. అనుకున్నదే తడవుగా తల్లిదండ్రులకు చెప్పగా ప్రోత్సహించారు. ఆఫీసులంటే ఎన్ని రకాలో ఇప్పుడు తెలుస్తోంది.

– ఎస్.సోని, విద్యార్థి, మామిడాల(తిప్పర్తి, నల్గొండ)

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగావకాశం కల్పించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సూచించారు. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామాల డివిజన్ల అభివృద్ధి సంక్షేమంపై అధికారులతో సమీక్షించారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులోకి తేవాలన్నారు. కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలని, కుందనపల్లి గ్రామాన్ని కాలుష్యం నుంచి కాపాడాలని కోరారు. రోడ్లు, సర్వీస్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వీర్లపల్లి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని, నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇప్పించి, ఇళ్లు నిర్మించే బాధ్యతను ఆర్ఎఫ్‌సీఎల్ తీసుకోవాలని సూచించారు. ఎన్టీపీసీ ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, ఆర్ఎఫ్‌సీఎల్ హెచ్ఆర్ సోమనాథ్, తహసీల్దార్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తన భర్త చనిపోయాగా కాంట్రాక్టు కార్మికురాలిగా విధుల్లోకి తీసుకున్న ఎన్టీపీసీ.. నెలలో 15రోజులే పని కల్పిస్తోందని నర్రశాలపల్లికి చెందిన నిర్వాసితురాలు ఈదునూరి కనకతార ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు విన్నవించారు. తనకు పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని కోరారు.

ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ సందర్శన


ట్రైనింగ్ సెంటర్ గురించి వివరిస్తున్న వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌ను రామగుండం ట్రాఫిక్ పోలీస్ అధికారులు సోమవారం సందర్శించినట్లు వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కొత్తగా ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తుండడంతో.. ఈ సెంటర్ నిర్వహణపై అధ్యయనం చేసేందుకు అక్కడి సీపీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు సందర్శించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించాల్సిన రికార్డులు, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహణ తదితర అంశాలను ఏసీపీ సత్యనారాయణ వివరించారు. అనంతరం మందుబాబులకు కౌన్సెలింగ్ విధానాన్ని రామగుండం పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పరిస్థితి దుర్భరం


మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

వేములవాడ: రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి దుర్భరంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తే జర్నలిస్టులను ఆదుకుంటామన్నారు. జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ చానళ్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి గతంలో రూ.10 లక్షల మేరకు ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపా క లక్ష్మణ్ అధ్యక్షతన బండి సంజయ్‌ని సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నాయకులు ప్రతాప రామకృష్ణ, కుమ్మరి శంకర్, వికాస్‌రావు, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీంలోకి రాజన్న గుడి

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ప్రసాద్ స్కీంలో చేర్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ అనేక అవమానాలు ఎదుర్కొన్నారు..

కరీంనగర్‌టౌన్: దేశ చరిత్రలో అంబేడ్కర్ ఎదుర్కొన్న అవమానాలు మరెవరూ ఎదుర్కోలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తన మేధాశక్తిని అణగారిన వర్గాల అభ్యున్నతికి ధారపోసిన మహనీయుడని కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన సెమినార్‌కు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్‌ను దళిత జాతికే పరిమితం చేయాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. చరిత్ర అంటే డూప్లికేట్ గాంధీ కుటుంబానిదే అన్నట్లుగా విపరీతమైన ప్రచారం చేసుకుని ఆయన్ను తక్కువ చేసిందన్నారు. కాంగ్రెస్ తీరుతో విసుగుచెంది రాజీనామా చేసి బయటకొచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తే కమ్యూనిస్టులతో కలిసిన రెండుసార్లు అంబేడ్కర్‌ను ఓడించిందన్నారు. డూప్లికేట్ గాంధీ కుటుంబసభ్యులైన నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీలకు భారతరత్న ఇచ్చుకుందన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్రలు చేసిందన్నారు. అంబేడ్కర్‌కు భారతరత్న వచ్చేలా చేసిన పార్టీ బీజేపీ అని అంబేడ్కర్ జయంతి రోజు రాష్ట్రీయ సమరసత దినంగా ప్రకటించి 120దేశాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్‌రెడ్డి, సోమిడి వేణు పాల్గొన్నారు.



హరహర మహదేవ

వేములవాడ: శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం దాదాపు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రాకతో వేములవాడలోని వీధులు రద్దీగా మారాయి. ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.



భూ భారతిపైనే ఆశలు

- పెండింగ్ సమస్యలకు పరిష్కార మార్గం
- 'చట్టం'పై జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు



సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్రప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన భూ భారతి ఆర్‌వోఆర్ -2025 చట్టంపైనే భూ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈమేరకు పెండింగ్‌తోపాటు పార్ట్ -బీ సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం గ్రామాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అధికారుల ద్వారా అందే సేవలు, అప్పిలేట్ అధికారి తదితర అంశాలపై అవగాహన సదస్సుల్లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వివరిస్తున్నారు. సదస్సులు ఈ నెల 17న ప్రారంభం కాగా.. ఈనెల 28వరకు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.


విస్తృత ప్రచారం చేస్తేనే ప్రయోజనం

రైతుల్లో అత్యధిక శాతం నిరక్షరాస్యులే. దీంతో గ్రామాల వారీగా భూ భారతిపై విస్తృతంగా ప్రచారం చేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పలువురు భావిస్తున్నారు. రెవెన్యూ సంబంధిత తప్పిదాల్లో సవరణ చేయడంతోపాటు ప్రభుత్వ, పోరంబోకు భూములు తదితర అంశాలకూ ఇందులో పరిష్కార మార్గాలు సూచిస్తారని అంటున్నారు.

సవరణలకు అవకాశం

పట్టాదారు పాసుపుస్తకాల్లో పొరపాట్ల సవరణ, రికార్డుల్లో నమోదుకు నోచుకోని భూహక్కుల కోసం ఈనెల 14వ తేదీ నుంచి ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం అఫిడవిట్‌తోపాటు తగిన ఆధారాలను సమర్పించాలి. తహసీల్దార్ జారీచేసిన మ్యుటేషన్ పాస్ పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోగా ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవాలి. ఆర్డీవో ఇచ్చే ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే మరో 30 రోజుల్లో కలెక్టర్‌కు రెండో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

విచారణ జరపాలి



భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని సాదాబైనామాపై భూములు కొనుగోలు చేసినవారు గతంలో దరఖాస్తు చేశారు. ఇలాంటి అర్జీలపై విచారణ జరపాలి. అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలి. ఇంకా దరఖాస్తు చేసుకునే వారు ఉంటే వారికి మరో అవకాశం ఇవ్వాలి.

– మహిపాల్‌రెడ్డి, రైతు, సుద్దాల

సద్వినియోగం చేసుకోవాలి



భూ భారతిపై గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సాదాబైనామాపై భూములు కొనుగోలు చేసిన వారు విచారణ సమయంలో అధికారులు అడిగిన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

– గంగయ్య, ఆర్డీవో, పెద్దపల్లి